క్లుప్తంగా

93 శాతం పింఛన్ల పంపిణీ



నాదెండ్ల: మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుక - సామాజిక భద్రతా పెన్షన్‌ల పంపిణీ మంగళవారం 93 శాతంపైగా పూర్తి చేశారు. మే మాసానికి మండల పరిధిలో 9289 పింఛన్లకు గాను రూ.2,56,00,750లు పంపిణీ చేయాల్సి ఉంది. ఉదయాన్నే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను సొమ్ము పంపిణీ చేశారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు.

ములకలూరులో ఆయుష్ వైద్యశిబిరం

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని ములకలూరు గ్రామ సచివాలయంలో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తెల్లటి కాటన్ దుస్తులు ధరించాలని, రోజుకు ఐదు లీటర్ల నీటిని తాగాలని, ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ నివారణ, వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఆయుష్ మందులను పంపిణీ చేశారు. తులసి, హరి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సేవలు ఎనలేనివి



నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే నిర్వహించారు. వైద్యాధికారి ప్రియాంక మాట్లాడుతూ గ్రామాల్లో ఆశా వర్కర్లు చేస్తున్న సేవలను కొనియాడారు. తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణ, ఫ్యామిలీ వైద్య విధానం, కిల్కారీ కాల్స్ గురించి విస్తృతంగా వివరించారు. అనంతరం చేకూరి వెంకటసుబ్బయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రజినీకాంత్ హాస్పటల్‌కు వీల్‌చైర్‌ను బహూకరించారు. సీహెచ్‌ఓ పద్మావతి, ఎంపీహెచ్ఈఓ విజయరాజు, అగ్నేశమ్మ, సీతామహాలక్ష్మమ్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నేడు పలు ఆలయాల పునఃప్రతిష్ట

నాదెండ్ల: గొరిజవోలు గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన ఆలయాల జీర్ణోద్ధరణ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ నెల 4వ తేదీన గురువారం ఉదయం 6.12 గంటల నుంచి 7.19 గంటల సమయంలో గ్రామంలో పునర్నిర్మించిన వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ట, జీవ ధ్వజస్తంభం, బొడ్డురాయి పునఃప్రతిష్ట కార్యక్రమాలు జరగనున్నాయి. ప్రధాన అర్చకులు పర్చూరిమాధవాచార్యులు, వాస్తువిద్వాన్ వెంకటరమణాచారి ప్రతిష్ట నిర్వహించనున్నారు. గ్రామంలో నాలుగు దిక్కుల గవిడిరాళ్లు, పోలేరమ్మ, పోతురాజు, అంకమ్మతల్లి, జంటనాగుల ప్రతిష్ట మహోత్సవం జరగనున్నాయి. అనంతరం అన్నదానం నిర్వహించనున్నారు. సాయంత్రం మహిళల కోలాట ప్రదర్శన, చెక్క భజన కార్యక్రమాలు జరగనున్నాయి.

మోదీ అవినీతిపై పోస్టుకార్డుల ఉద్యమం

వినుకొండ(నూజెండ్ల): ప్రధానమంత్రి మోదీ, అదానీల అక్రమ సంపాదనపై ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోస్టుకార్డుల ఉద్యమాన్ని మంగళవారం ప్రారంభించారు. పల్నాడు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా గోపి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి అట్లూరి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజల స్పందనను పోస్టుకార్డు ద్వారా సేకరించారు. ఆ పార్టీ నాయకులు కాళిదాసు, షేక్ కరిముల్లా, రాకేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఫైర్ స్టేషన్ సమీపంలో నివసించే ఈపూరి దుర్గారెడ్డి (45) సోమవారం రాత్రి ద్విచక్రవాహనంపై నరసరావుపేటకు వెళ్లి తిరుగు ప్రయాణంలో పట్టణంలోని ఎన్‌ఆర్‌టీ సెంటర్ వద్ద రోడ్డు దాటుతుండగా, ఒంగోలు వైపు వెళుతున్న లారీ ఢీకొట్టింది. దుర్గారెడ్డి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి కుమారుడి సాంబిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోళ్ళపాడు చప్టాపై ఇసుక లారీ బోల్తా

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు వాగు పై ఉన్న చప్టా వద్ద ఇసుక లారీ బోల్తా పడిన ఘటన మంగళవారం జరిగింది. సత్తెనపల్లి నుంచి నరసరావుపేట వైపు వెళుతున్న ఇసుక లారీ అదుపు తప్పి మార్జిన్‌లోకి దూసుకెళ్లి పక్కకు పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సింగ్‌కు స్వల్పగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నరసరావుపేటకు తరలించారు. జరిగిన సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు నమోదు కాలేదని ముప్పాళ్ళ పోలీసులు తెలిపారు.

అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- నూజెండ్ల మండలం కంభంపాడులో గడపగడపకు మన ప్రభుత్వం



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): అర్హత ఉన్న అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. నూజెండ్ల మండలంలోని కంభంపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 95శాతం అమలు చేశామని, గతంలో ఎవరైనా ఇలా అమలు చేశారా అని ప్రశ్నించారు. జగనన్న భూహక్కు పథకం కింద ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని, నూజెండ్ల మండలంలోని అప్పాపురం, కొండ్రప్రోలు, తిమ్మాపురం గ్రామాల్లో అగ్రహార భూములను కూడా సర్వే చేసి రైతులకు హక్కులు కల్పిస్తున్నట్లు చెప్పారు. నాడు - నేడు పథకం కింద రూ.వందల కోట్ల నిధులతో పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చి పేద పిల్లలు కూడా ఇంగ్లిష్ మీడియం చదువుకునేలా ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టినట్లు చెప్పారు.

ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు, టీడీపీ నైజం...

ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజమని, గతంలో రుణమాఫీ చేస్తానని చెప్పి నమ్మబలికి ఓట్లు వేసిన ప్రజలను మోసం చేశారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల సభ్యులు పేదవారి దగ్గర కూడా సంక్షేమ పథకాల పేరుతో దోచుకున్నారని, సీసీ రోడ్లు కూడా నాసిరకంగా వేసి ప్రజాధనాన్ని దోచుకున్నారన్నారు. నేడు మా స్వగ్రామమైన వేల్పూరులో రూ.20కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామని, సంక్షేమ పథకాల రూపేన రూ.46.44కోట్లు ప్రజలకు అందించామని అన్నారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి లేదని, స్వగ్రామంలో కూడా అభివృద్ధి చేయలేని మాజీ ఎమ్మె ల్యే పదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నక్కా నాగిరెడ్డి, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, వైస్ చైర్మన్ కొమిరిశెట్టి రామారావు, ఎంపీటీసీ వెంకటేశ్వరరెడ్డి, స్థానిక నాయకులు అంజిరెడ్డి, హనుమయ్య, పసుపులేటి కొండలు, తలారి ఆంజనేయులు, ఒంగూరి ప్రసాద్, గాదె నాగార్జునరెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన వీధి దీపాలు

- గడప గడపలో వచ్చిన సమస్యలపై సత్వరం స్పందించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి
- ఎమ్మెల్యే ఆదేశాలతో 12వ వార్డులో వీధి దీపాలు ఏర్పాటు చేసిన అధికారులు



వీధి దీపాలను ఏర్పాటుచేస్తున్న సిబ్బంది

నరసరావుపేట: పట్టణంలోని ప్రకాష్‌నగర్ 12వార్డులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పురపాలక విద్యుత్ విభాగం అధికారులు పరిష్కరించారు. గత నెల 30వ తేదీ, ఈనెల ఒకటో తేదీలలో రెండు రోజుల పాటు శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వార్డులో ఇంటింటికి పర్యటించారు. ఆ సమయంలో షాలెంనగర్‌లో బిలాల్ మసీదు బజారు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మురళి ఇంటి దగ్గర ప్రజలు మూడు నూతన వీధి దీపాలను ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే సూచనలతో సంబంధిత సమస్యలపై మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్, డీఈ ఓలేటి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ విభాగ అధికారులు యుద్ధప్రాతిపదికన నూతన వీధి దీపాలు ఏర్పాటు చేశారు. దీంతో వార్డు ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

పన్ను వసూళ్లలో రికార్డు

- నరసరావుపేట మున్సిపాల్టీలో అత్యధిక పన్ను వసూలు
- వడ్డీ రాయితీ, 5 శాతం రాయితీలను ఉపయోగించుకున్న పౌరులు



మున్సిపల్ కార్యాలయం

నరసరావుపేట: నరసరావుపేట పురపాలక సంఘానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ఈ ఏడాది అధికంగా పన్నులు వసూలయ్యాయి. దీనికి స్థానిక శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కృషి కూడా కలసి వచ్చింది. ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో పన్నులు చెల్లించేందుకు ప్రభుత్వం కల్పించిన ప్రత్యేక వడ్డీ రాయితీ వెసులుబాటుతో రికార్డు స్థాయిలో ప్రజలు పన్నులు చెల్లించగా, 2023-24 ఏడాదికి ఏప్రిల్ నెలాఖరులోగా ఒకేసారి ఏడాది పన్నులు చెల్లించేవారికి ప్రభుత్వం కల్పించిన ఐదుశాతం రాయితీని ఉపయోగించుకోవటంలో ప్రజలు ముందంజలో ఉన్నారు. పురపాలక పరిధిలోని 34 వార్డుల్లో పన్ను చెల్లించే 31,784 అసెస్‌మెంట్లు ఉండగా వాటి ద్వారా రూ.16.25కోట్లు పన్నులు వసూలు కావాల్సివుంది. దీనిలో గత మార్చి 31 నాటికి రికార్డు స్థాయిలో రూ.14.03 కోట్ల పన్ను వసూలైనట్లు రెవెన్యూ విభాగం అధికారులు తెలియచేశారు. గత కొన్నేళ్లుగా కోర్టు కేసులు, ఇతరత్రా కారణాలతో ఆస్తిపన్ను చెల్లించని వారికి ప్రభుత్వం కల్పించిన వడ్డీ మాఫీని ఉపయోగించుకొని అనేకమంది అసలు పన్నులు చెల్లించి తమపైనున్న భారాన్ని తొలగించుకున్నారు. అలాగే ఏప్రిల్ చివరినాటికి ఐదుశాతం రాయితీని ఉపయోగించుకుంటూ రూ.3.82కోట్ల పన్నులను ఆస్తిపన్నుదారులు చెల్లించారు. ఇది గతేడాదికంటే రూ.80లక్షలు అధికమని అధికారులు తెలియచేస్తున్నారు. అధికంగా పన్ను వసూలు కావటంతో అభివృద్ధి పనులు చేయటంతో పాటు పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి సూచనలతో అధికారులు సిద్ధమవుతున్నారు.

హంసవాహనంపై ఊరేగిన రంగనాథుడు



యడ్లపాడు: యడ్లపాడు మండలం సొలస గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో నిత్యం సందడి నెలకొంటుంది. భూ సమేత రంగనాయక స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల రెండోరోజు కార్యక్రమాలు మంగళవారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పరుచూరి రామకృష్ణమాచార్యులు నేతృత్వంలో ఉదయం నుంచే స్వామివారికి బిందెతీర్థం, నిత్యార్చన, విశేష హోమాలు, బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం నరసరావుపేటకు చెందిన ఇన్నమూరి రామ బ్రహ్మయ్య భక్తబృందం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. సాయంత్రం అర్చన, నిత్యహోమం జరగ్గా అనంతరం సర్వాంగ సుందరంగా అలంకృతుడైన రంగనాథుడు హంస వాహనంపై ఊరేగారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు పలు రకాల ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్ దంపతులు, అర్వపల్లి బ్రదర్స్, గ్రామపెద్దలు పాల్గొనగా ఆలయ ఈఓ సీహెచ్ శివయ్య పర్యవేక్షించారు.

హనుమాన్ శోభాయాత్ర కరపత్రాలు విడుదల



శోభాయాత్ర కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర ఈ నెల 7వ తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తన కార్యాలయంలో హనుమాన్ శోభాయాత్ర కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో భాగంగా బైక్‌ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ విశ్వహిందూపరిషత్ వారు చేపట్టిన హనుమాన్ శోభాయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. విశ్వహిందూపరిషత్, హనుమాన్ శోభాయాత్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ తనిఖీలు



రొంపిచర్ల: స్థానిక ప్రాథమిక వైద్యశాలను డీఎంహెచ్‌ఓ డాక్టర్ శోభారాణి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె వైద్యశాలలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆశా డే సందర్భంగా ఆశా కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఆశా వర్కర్ల పనితీరును సమీక్షించారు. సాధారణ తనిఖీల్లో భాగంగానే వైద్యశాలను సందర్శించామన్నారు. ప్రతినెలా మొదటి మంగళవారాన్ని ఆశా డేగా నిర్వహిస్తామన్నారు. వైద్యాధికారి డాక్టర్ పోతిరెడ్డి జగన్ నరసింహారెడ్డి, వైద్యశాల సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మైదవోలు శివాలయంలో ప్రత్యేక పూజలు



యడ్లపాడు: మండలంలోని మైదవోలు గ్రామంలో వేంచేసి ఉన్న గంగాసమేత ఉమామహేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల కల్యాణోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ నేపథ్యంలో ఆలయంలో పదహారురోజుల పండుగను నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామివారికి వివిధ రకాల అభిషేకాలు, పుష్పాలతో అలంకరణ చేశారు. అనంతరం స్వామివారిని భక్తులు సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు రకాల ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆలయంలో వివాదంపై డీసీ విచారణ

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆలయ ఈఓ వేమూరి గోపి, ఆలయ అర్చకులు, కార్యాలయ సిబ్బందికి మధ్య నెలకొన్న వివాదంపై దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఈమని చంద్రశేఖరరెడ్డి మంగళవారం ఆలయంలో విచారణ జరిపారు. ఈఓ గోపితో పాటు ఆలయ సిబ్బంది, అర్చకులతో విడివిడిగా మాట్లాడి వారి స్టేట్‌మెంట్‌లు రికార్డు చేశారు. దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయంలో నెలకొన్న వివాదంపై విచారణ జరిపినట్లు డీఈ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఈఓ, అర్చకులు, సిబ్బంది ఇచ్చిన స్టేట్‌మెంట్స్‌తో నివేదికను తయారుచేసి ఉన్నతాధికారులకు పంపుతామని, వారి నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈఓ వైఖరికి నిరసనగా ఈనెల 4వ తేదీ నుంచి ఆలయంలో ఆర్జిత సేవలు నిలిపివేస్తున్నట్లు అర్చకులు, కార్యాలయ సిబ్బంది ప్రకటించిన విషయం తెలిసిందే. తమ సమస్య పరిష్కారం కాకపోతే ఈనెల 4వ తేదీ నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతామని అర్చకులు, కార్యాలయ సిబ్బంది తెలిపారు.

ఉత్తమ సేవలకు అభినందన



సర్పంచ్ శ్రీనివాసరావు, కార్యదర్శి మనోహర్‌లను సత్కరిస్తున్న ఎంపీడీఓ సీతారామయ్య

శావల్యాపురం: గ్రామ పంచాయతీ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ లోతోటి శివశంకరు చేతుల మీదగా సర్పంచ్ మొనపాటి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ముంగ్రు మనోహర్‌లు ప్రశంసా పత్రంతో పాటు ఘన సత్కారం అందుకోవడం అభినందనీయమని ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య అన్నారు. మంగళవారం మండలంలోని శానంపూడి గ్రామ సచివాలయంలో అభినందన సభ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనలో ఉత్తమ సేవలకు జిల్లా, మండలస్థాయిలో శానంపూడి గ్రామపంచాయతీను ఎంపిక చేయటం చాలా సంతోషకరమన్నారు. అనంతరం ఇరువురును దుశ్శాలువాలు, పూల దండలతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెన్నంశెట్టి రంగారావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రీసర్వే పనులు వేగవంతం చేయాలి

డివిజన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి ఉంగరాల భాస్కర్

శావల్యాపురం: రీసర్వే రికార్డుల పనులు వేగవంతం చేయాలని నరసరావుపేట డివిజన్ డిప్యూటి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి ఉంగరాల భాస్కర్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న రీసర్వే రికార్డు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలోని వేల్పూరు, పిచికలపాలెం, పోట్లూరు, శానంపూడి రెవెన్యూ గ్రామాల్లో రైతుల సమక్షంలో రెవెన్యూ అధికారులు భూముల కొలతలు సరిహద్దులు ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం పూర్తయిందన్నారు. తదుపరి సంబంధిత గ్రామాల్లోని రైతులకు ఫామ్ 9(2) నోటీసులు అందజేయటానికి రికార్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు చెప్పారు. రీసర్వే పనుల్లో రైతుల తమ వంతు సహకారం అందించాలన్నారు. పనులు పూర్తయిన గ్రామాల్లోని రైతులు తమ భూములకు సంబంధించి ఏమైనా సమస్యలు, అభ్యంతరాలు ఉంటే సమగ్ర ఆధారాలతో రెవెన్యూ అధికారులను సంప్రదించాలన్నారు. ఆయనతో పాటు తహసీల్దార్ షేక్ జాన్‌సైదులు, డిప్యూటీ తహసీల్దార్ వేముల వెంకట నాగరాజు, పి.నాసరయ్య, మండల డిప్యూటీ సర్వేయర్ తుంగా శ్రీనివాసరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సచివాలయాల్లో మెరుగైన సేవలందించాలి



వెల్లటూరు సచివాలయంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ ఎం.వెంకటరెడ్డి

బొల్లాపల్లి: సచివాలయం ద్వారా మెరుగైన సేవలు అందించాలని నరసరావుపేట డీఎల్‌డీఓ ఎం.వెంకటరెడ్డి సూచించారు. మండలంలోని వెల్లటూరు, నాయుడుపాలెం, పేరూరుపాడు సచివాలయాలను మంగళవారం ఆయన సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. సచివాలయం ద్వారా అందుతున్న సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వే సమగ్రంగా చేయాలని, 0-5, 6-9 వయసు గల చిన్నారుల ఆరోగ్య స్థితిగతులపై సమగ్ర సర్వే రూపొందించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ సర్వే పూర్తి చేయాలని సూచించారు. రక్తహీనత కలిగిన పిల్లలను గుర్తించి వారికి పోషకాహారం అందించేలా తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. సచివాలయాల్లో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జి.శ్రీహరి, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులు వచ్చే పంటలు సాగు చేయాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న చిన్నప్ప

సత్తెనపల్లి: ఎస్సీ, ఎస్టీ రైతులు భూసార పరీక్షలు చేయించుకుని తమ పొలాల్లో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలను సాగు చేసుకోవాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అన్నారు. సత్తెనపల్లి మండలం బట్లూరు గ్రామంలో దళిత బహుజన రిసోర్సెస్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ సమావేశం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. చిన్నప్ప మాట్లాడుతూ ప్రస్తుతం పచ్చిరొట్ట విత్తనాలైన పిల్లిపెసర, జీలుగు, జనము 50 శాతం సబ్సిడీ ద్వారా రైతు భరోసా కేంద్రాల నుంచి ఇవ్వడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామంలో ఉన్నటువంటి రైతు లందరూ భూసార పరీక్షలు చేయించుకుని భూమిలో ఉన్న సారాన్ని బట్టి పంటలు సాగుచేయాలని, గ్రామాల్లో భూ యజమానుల దగ్గర నుంచి భూమిని కౌలుకి తీసు కున్న రైతులు భూ యజమానులతో మాట్లాడి వారి ద్వారా అనుమతి పత్రంపై సంతకాలు చేయించుకుని క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డులు (సీసీఆర్సీ) తీసుకుని రైతు భరోసా రూ.13,500, ఇన్పుట్ సబ్సిడీపై రుణాలు పొందాలని, ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఈ-క్రాప్ నమోదు ద్వారా పండించిన పంటలను మార్కెట్లో గిట్టుబాటు ధరలకు అమ్ముకోవడానికి అవకాశం ఉంటుందని, మీరందరూ కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని అనుకూలమైన పంటలు వేసి అధిక దిగుబడులు సాధించి అభివృద్ధి చెందాలని రైతులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ రైతులు పాల్గొన్నారు.

పెరియార్ రీడర్ పుస్తక పరిచయ సభ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న బత్తిన శ్రీనివాస బాబు, సయ్యద్ అబ్దుల్ రహీం

సత్తెనపల్లి: పట్టణంలోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో ఈనెల 7న సాయంత్రం ఐదు గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ గుంటూరు వారి ఆధ్వర్యంలో పెరియార్ రీడర్ పుస్తక పరిచయ సభ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని తాలూకా సెంటర్‌లో మంగళవారం పెరియార్ రీడర్ పుస్తక పరిచయ సభ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. పుస్తక పరిచయ సభకు ప్రధాన వక్తగా ఏపీ పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, వక్తలుగా సీనియర్ న్యాయవాదులు బత్తిన శ్రీనివాస్ బాబు, సయ్యద్ అబ్దుల్ రహీం, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు హాజరవుతారన్నారు. కవి, జర్నలిస్ట్ బి.విల్సన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. సామాజిక కార్యకర్తలు, న్యాయ వాదులు, ప్రముఖులు, హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు బత్తిన శ్రీనివాస బాబు, సయ్యద్ అబ్దుల్ రహీం, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు, ప్రజా కళాకారుడు ఉన్నవ నాగేశ్వరరావు, కవి,జర్నలిస్ట్ బి.విల్సన్, జర్నలిస్ట్ బండారు సురేష్ బాబు, వెంకటేశ్వర్లు, తది తరులు ఉన్నారు.

రైతులు అధికారుల సూచనలు పాటించాలి

సత్తెనపల్లి: ప్రస్తుతం అకాల వర్షాలు కురుస్తుండడంతో రైతులు పంటలు చేతికి వస్తాయా లేదా అని సందేహపడుతుంటారని, అందులోనూ ప్రధాన పంట అయిన మిరప పంట కోత అనంతరం చేపట్టవల్సిన చర్యల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సత్తెనపల్లి ఉద్యానవన శాఖాధికారిణి సీహెచ్.జనని చెప్పారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం మిరప పంట కోత (రెండవ, మూడవ కోత) కల్లాల్లో ఎండు తున్న దశలో ఉందన్నారు. కల్లాల్లో ఉన్న కాయలు తడవకుండా టార్పాలిన్ పట్టాలతో కప్పి జాగ్రత్త చేసుకోవాలన్నారు. అధిక తేమ వల్ల పంట మీద ఉన్న కాయలకు కాయ కుళ్ళు రావడానికి అవకాశం ఉందని, కాబట్టి ముందు జాగ్రత్తగా మాంకోజెబ్ (లీటరుకి 2.5 గ్రాములు) లేదా క్లోరోథలోనీల్ (లీటరుకి 2 గ్రాములు) లేదా థయోఫినైట్ మిథైల్ (లీటరుకి 2 గ్రాములు) పిచికారీ చేయాలన్నారు. తెగులు ఉధృతి నివారించ డానికి డైఫిన్ కొనాజోల్ 0.5 ఎంఎల్ లేదా ప్రొపికొనాజోల్ ఒక ఎంఎల్ పిచికారీ చేసిన తరువాత కార్బియోటాప్ లీటరుకి 3 గ్రాములు లేదా అజాక్సిస్ట్రోబిన్ ఒక ఎంఎల్ చొప్పున పిచికారి చేయాలని సూచించారు. సూక్ష్మపోష మిశ్రమం (ఎగ్రో మిన్ మాక్స్) లీటరుకి 2.5 గ్రాములు చొప్పున, స్థూల పోషక మిశ్రమము (13-0-45) లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున పంటపై పిచికారీ చేయాలన్నారు. వర్షాలు ఆగిన తరువాత కోత కోసి ఎండబెట్టే టప్పుడు కాయకుళ్ళు ఆశించిన కాయలను వేరుచేసి విడివిడిగా ఎండబెట్టుకోవాలన్నారు. రైతులు తగు జాగ్రత్తలు తీసుకోని మిరప పంటను కాపాడుకోవాలని ఆమె తెలిపారు.

స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించాలి

శావల్యాపురం: స్పందన అర్జీలను సత్వరం పరిష్కారించాలని తహసీల్దార్ షేక్ జాన్‌సైదులు అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై అన్నీ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు అన్నిశాఖల అధికారుల సమన్వయంతో స్పందన అర్జీలను పెండింగ్ ఉంచకుండా త్వరితగతిన పరిష్కారమయ్యే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. పరిష్కారం కాకపోతే అందుకుగల కారణాలను లబ్ధిదారులకు అధికారులు వివరించాలన్నారు. మండలంలోని శానంపూడి గ్రామంలో అంగన్‌వాడీ సెంటరుకు విద్యుత్ సౌకర్యం, మండలంలోని పోట్లూరు గ్రామంలో ఎస్సీ కాలనీలో మురుగునీరు పోనివ్వకుండా అడ్డుకుంటురనే సమస్య, ఇతర సమస్యలు పరిష్కారమయ్యే దిశగా చర్యలు తీసుకున్నామన్నారు. స్పందన అర్జీలను నిర్లక్షం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈసదస్సులో మండల డిప్యూటీ తహసీల్దార్లు వేముల వెంకట నాగరాజు, పి.నాసరయ్య, ఆర్ఐ చంద్రబాబు, ఈఓపీఆర్డీ పి.సుగుణ, పోలీసు, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.